సమాజహితం

WWW.SAMAJAHITHAM.COM | PRGI : T/TG/2026/0819/5664/1384

సంపుటి: 01 సంచిక: 05 సమాజహితం - తెలుగు దినపత్రిక ఎడిటర్: హరీష్ ఆచార్య మంగళవారం 10-11-2026 పేజీలు: 06 వెల: రూ.2.00





ఈజిప్టులో ఘోర రైలు

ప్రమాదం

ఏడుగురు మృతి 100 మందికి గాయాలు

ఢిల్లీ,: ఈజిప్టులోని గిజా నగరం సమీపంలో ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. గిజా ప్రావిన్స్‌లో రెండు ప్యాసింజర్ రైళ్లు ఢీకొన్నాయి. అల్ అయ్యత్ జిల్లా నుంచి ఫయూమ్ వెళ్తున్న ఓ ప్యాసింజర్ రైలు.. కైరో నుంచి అస్వాన్ వెళ్తున్న మరో రైలును వెనక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగుడరు మృతి చెందారు. మరో 100 మందికిపైగా గాయాలయ్యాయి. ప్రమాద ధాటికి అనేక బోగీలు పట్టాలు తప్పి కాలువలోకి జారిపడ్డాయని దేశ రైల్వే అథారిటీ తెలిపింది. అత్యవసర బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

2వ పేజీలో...



దీపావళి శుభాకాంక్షల్లో

వివాదం

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం!

- దీపావళిని 'ఖుషియోన్ కీ ఈద్' అన్న ఖర్గే
- మతపరమైన బుజ్జగింపులు అంటూ కాంగ్రెస్‌పై బీజేపీ ఆరోపణలు
- హిందువుల మనోభావాలు దెబ్బతీశారన్న కేశవన్
- ఈద్‌తో పోల్చడంపై భాటియా అభ్యంతరం
- ఐక్యత కోసమే ఆ పదం వాడారన్న కాంగ్రెస్

ఢిల్లీ,: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు దేశ రాజకీయాల్లో వివాదానికి దారితీసింది. దీపావళిని 'ఖుషియోన్ కీ ఏక్ ఈద్' (సంతోషాల పండగ)గా అభివర్ణించడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మైనారిటీలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ మతపరమైన బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందనిఆరోపించింది. అయితే 'అన్ని వర్గాల ప్రజలు కలిసి జరుపుకొ నే సంతోషాల పండగ' అనే ఉద్దేశంతోనే ఖర్గే ఆ పదాన్ని ఉపయోగించారని కాంగ్రెస్ నేతలు వివరణ ఇచ్చారు.



ఇరాన్‌పై మళ్లీ యుద్ధం..

అత్యంత అసంభవం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్ : ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో మరోసారి యుద్ధం చేయాల్సిన పరిస్థితి తలెత్తే అవకాశాలు అత్యంత తక్కువ అని అన్నారు. అయితే.. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు, హోర్ముజ్ జలసంధిని మళ్లీ తెరిచే అంశాలపై గట్టి ఒప్పందం కుదరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ డీల్‌కు ఇరాన్ అంగీకరించకపోతే తాము మరోసారి సైనిక దాడులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

2వ పేజీలో...



మధ్యప్రదేశ్‌లో దీపావళి

విషాదం

2 ప్రమాదాల్లో 12 మంది మృతి..

రెండు కుటుంబాలు బుగ్గి

భోపాల్: మధ్యప్రదేశ్‌లో దీపావళి రాత్రి పెను విషాదం చోటుచేసుకున్నది. రెండు వేర్వేరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. ఆ ప్రమాదాల్లో 12 మంది మృతిచెందారు. రెండు కుటుంబాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కట్నీ, సియోని జిల్లాల్లో ఆదివారం రాత్రి ఈ ప్రమాదాలు జరిగాయి. కట్నీ జిల్లాలోని బర్హి పట్టణంలో ఓ అగర్వాల్ కుటుంబానికి చెందిన ఆరుగురు అగ్నిప్రమాదానికి బలయ్యారు.



ఐదు రాష్ట్రాల ఎన్నికల

షెడ్యూల్

జనవరిలో ప్రకటనకు ఈసీ కసరత్తు

- యూపీ, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్‌లలో జరగనున్న ఎన్నికలు
- షెడ్యూల్ ప్రకటనకు ముందు రాష్ట్రాల్లో పర్యటించనున్న ఈసీ పూర్తిస్థాయి బెంచ్
- యూపీలో పలు దశల్లో, మిగతా రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ అంచనా
- ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో డిప్యూటీ కమిషనర్ల స్థాయి పర్యటనలు పూర్తి

ఢిల్లీ,: దేశంలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తూ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తును ముమ్మరం చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను రానున్న జనవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రకటనకు ముందు, ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఈసీ పూర్తిస్థాయి బెంచ్ పర్యటించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లతో కూడిన ఈ పూర్తిస్థాయి బెంచ్, నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో తమ పర్యటనలను ప్రారంభించే అవకాశం ఉంది.



తెలంగాణ హైకోర్టు

సంచలన తీర్పు

జిల్లా కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష


- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి 6 నెలల జైలు శిక్ష
- రూ.2 వేల జరిమానా విధించిన హైకోర్టు
- కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారణ
- 60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని గతంలో ఆదేశం
- గడువు దాటినా స్పందించకపోవడంతో కలెక్టర్‌పై చర్యలు

హైదరాబాద్:కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ. 2 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

హైదరాబాద్‌పై కాలుష్య పంజా

ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

- హైదరాబాద్‌ను వణికిస్తున్న వాయు కాలుష్యం
- ప్రమాదకరంగా 410కి చేరిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో అత్యధిక కాలుష్యం
- సాధారణం కంటే నాలుగు రెట్లు పెరిగిన పీఎం 2.5 స్థాయిలు
- వాహనాలు, నిర్మాణాలే ప్రధాన సమస్యగా గుర్తింపు



2వ పేజీలో...



హైదరాబాద్: ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం.

కరీంనగర్ : కరీంనగర్ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో, కరీంనగర్‌లో గతంలో జరిగిన అభివృద్ధికి, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధికి మధ్య తేడా చూడాలని కోరారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిధులు తీసుకొస్తున్నామని తెలిపారు.



అలా చేస్తే ప్రజలు ఉరికించి

కొడతారు

బండి సంజయ్ వార్నింగ్

కమాన్ పూర్ లో అలాయి బలాయి వేడుకలు



కమాన్ పూర్ నవంబర్ 9: కమాన్ పూర్ మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహ ఆవరణలో వన్ వరల్డ్ వన్ పీపుల్ వ్యవస్థాపకుడు రానవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో అలై బలయీ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది . దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం రోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గాండ్ల మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు కమాన్ పూర్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తాటికొండ శంకర్ బిజెపి మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ బిఆర్ఎస్ యువత అధ్యక్షులు బొమ్మగాని అనిల్ బిజెపి జిల్లా నాయకులు మచ్చ గిరి రాము బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూంపల్లి రాజయ్య, మత్స్య శాఖ చైర్మన్ గడప కృష్ణమూర్తి పాల్గొని అలైబాలయీ కార్యక్రమం గురించి మాట్లాడడం జరిగింది ఉదయం ప్రారంభమైన వేడుకలు మధ్యాహ్నం భోజన కార్యక్రమం అనంతరం కొంత విరామం తీసుకుని సాయంత్రం ఏడు గంటలకు లక్ష్మి పూజ స్థానిక పురోహితుల చేత నిర్వహించడం జరిగింది . ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ మాట్లాడుతూ ఎలాంటి స్వలాభం చూసుకోకుండా నిస్వార్థంగా కొన్ని సంవత్సరాలుగా కమాన్పూర్ మండలంలో అనేకమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రానవేణి లక్ష్మణ్ ని కొనియాడారు కార్యక్రమం వేడుకలను ఉద్దేశించి ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలు లేకుండా పోతున్నాయని ఇటువంటి తరుణంలో ఆలయ్ బాలయీ కార్యక్రమం మానవ విలువల పట్ల బంధాలు అనుబంధాలు సమాజంలో కోల్పోతున్న అనేకమైన విలువలను ఇలాంటి ప్రోగ్రాం ద్వారా ఒకరిని ఒకరు అలై బలయీ చేసుకోవడం మానవ బంధాలను మరొకసారి గుర్తుకు తెస్తున్నాయని పార్టీలకు అతీతంగా కుల మతాలకు అతీతంగా అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు కార్యక్రమ సభ అధ్యక్షుడు వడ్లకొండ తిరుపతి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ వ్యవస్థాపకుడు జంగాపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నగనూరి నరసయ్య కాంగ్రెస్ బిజెపి జిల్లా నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ జంగాపల్లి అజయ్ దాసరి సురేందర్ గుర్రం లక్ష్మీ మల్లు నక్క శంకర్ హెచ్ఎంఎస్ నాయకులు హెచ్ ఎం స్ నాయకులు నజీమ్, పిన్నింటి రవీందర్ రెడ్డి తీగల శ్రీధర్ జంగాపల్లి అజయ్ చత్రపతి శివాజీ అధ్యక్షులు శేఖర్ చిప్పకుర్తి కనుక దాసరి రామచందర్ మెకానిక్ సత్యం గుల్గం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం: ఎమ్మెల్యే



మరిపెడ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాకే నిరుపేదలకు సంక్షేమాలు సక్రమంగా అందుతున్నాయని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల తహసీల్దార్ కృష్ణవేణి ఆధ్వర్యంలో మరిపెడ మండల కేంద్రంలోని రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు అందించి మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ, రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్రాజెక్టులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణలో మహిళలకు అవకాశాలు కల్పించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. గత పదేళ్లలో పేదలకు ఇళ్ల నిర్మాణంలో ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరలేదని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని డాక్టర్ రామచంద్రు నాయక్ అన్నారు. నిజమైన నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులకు ఎలాంటి అవినీతికి తావులేకుండా ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు గురుకుల పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటర్నేషనల్ స్కూల్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ కళాశాల ఏర్పాటు దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అదేవిధంగా వైద్య సదుపాయాల మెరుగుదల, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

డోర్నకల్ అభివృద్ధికి రూ. 800 కోట్ల నిధులు..: డోర్నకల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ప్రభుత్వ విప్ తెలిపారు. మున్సిపాలిటీలకు రూ. 50 కోట్ల చొప్పున నిధులు కేటాయించడంతో పాటు సుమారు రూ. 800 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పట్టణంలో అంతర్గత రహదారులు, గుండెపురి రోడ్డు, ఇతర రోడ్ల నిర్మాణ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గత ప్రభుత్వ పాలనలో జరిగిన వరిణామాలను గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెండ్లి రఘువీర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్, టౌన్ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్, వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు జాటోతు సురేష్, మెరుగు రాము, తిరుపతి, పానుగోతు రాములు, కాంతమ్మ కరణ్ సింగ్, నీలా లచ్చిరాం, కో ఆప్షన్ సభ్యులు షేక్ అజీజ్, గుండగాని వెంకన్న, షేక్ సలీమా తాజోద్దీన్, దేవరశెట్టి శ్రీలత లక్ష్మీనారాయణ, 3వ వార్డు అధ్యక్షుడు శ్రీను, కుడితి నరసింహ రెడ్డి, ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, అప్సర్, చీనా నాయక్, గంధసిరి భిక్షపతి, వెర్మారెడ్డి వెంకట్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బోడ రవి, చింతల వెంకన్న, దస్రు నాయక్, కృష్ణ మూర్తి, బోడ శ్రీను, రంజిత్, సయ్యద్ సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షల్లో వివాదం..

మొదటిపేజీ తరువాయి...

దీపావళి సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖర్గే.. దేశ ప్రజలందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి దేశమంతటా అందరూ జరుపుకొనే పెద్ద పండగని, సంతోషాలను పంచే వేడుకని పేర్కొన్నారు. దీర్ఘకాలం పాటు కొనసాగే ఆనందోత్సవమని చెబుతూ 'ఖుషియోన్ కీ ఏక్ ఈద్' అనే పదాన్ని ఉపయోగించారు. పండగ వేళ ప్రజల మధ్య ఐక్యత పెరగాలని, సామాజిక విభేదాలు తొలగిపోవాలని పిలుపునిచ్చారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడ్డారు. హిందువుల పవిత్ర పండగ దీపావళిని మరో మతానికి చెందిన పండగతో పోల్చడం ద్వారా కోట్లాది మంది హిందువుల మనోభావాలను కాంగ్రెస్ దెబ్బతీస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు. మతపరమైన బుజ్జగింపు రాజకీయాల కోసం కాంగ్రెస్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. గతంలో ఖర్గే మహాకుంభమేళాపై చేసిన వ్యాఖ్యలను, రాహుల్ గాంధీ ఛఠ్ పూజ సందర్భంగా ప్రధాని మోదీపై చేసిన విమర్శలను కూడా ప్రస్తావించారు. మరో బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ.. ఖర్గే వ్యాఖ్యలను బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనంగా అభివర్ణించారు. ఈద్‌ను హిందూ పండగతో పోల్చి కాంగ్రెస్ నేతలు మాట్లాడగలరా? అని ప్రశ్నించారు. మరోవైపు బీజేపీ నేత గౌరవ్ భాటియా కూడా దీపావళికి ప్రత్యేకమైన సంప్రదాయాలు, గుర్తింపు ఉన్నాయని.. ఆ పండగను అదే పేరుతో గౌరవించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మాత్రం ఖర్గే వ్యాఖ్యలను సమర్థించింది. 'ఈద్' అనే పదాన్ని మతపరమైన అర్థంలో కాకుండా సంతోషాల వేడుకగా విస్తృత భావంలో ఉపయోగించారని వివరించింది. వివిధ మతాలు, సంస్కృతుల మధ్య ఐక్యతను చాటడమే ఆయన ఉద్దేశమని తెలిపింది. మరోవైపు ఎంఐఎం అధికార ప్రతినిధి వారిస్ పఠాన్ కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. రెండు పండగలను రాజకీయ ప్రయోజనాల కోసం పోల్చడం సరికాదని వ్యాఖ్యానించారు. దీంతో దీపావళి శుభాకాంక్షల సందర్భంగా మొదలైన వివాదం కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలకు వేదికగా మారింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల గుర్తింపు.. బాధితులకు అప్పగింత

హనుమకొండ కలెక్టరేట్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఐఆర్ పోర్టల్ ద్వారా హనుమకొండ పోలీసులు గుర్తించారు. సోమవారం 5 సెల్‌ఫోన్లను సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత బాధితులకు అప్పగించారు. హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సీఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ నరసింహారావు, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, సీఇఐఆర్ పోర్టల్ నిర్వాహకుడు కానిస్టేబుల్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌పై కాలుష్య పంజా



ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేపకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు..

మొదటిపేజీ తరువాయి...

అయితే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 60 రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అయితే గడువు ముగిసినా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబరు 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాతే అధికారులు స్పందించారు. బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు ఇచ్చారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించడం, కోర్టు ఆదేశించిన గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

ఈజిప్టులో ఘోర రైలు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి...

మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. ప్రమాద ఘటనపై త్వరితగతిన దర్యాప్తు జరపాలని ఆ దేశ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ అధికారులను ఆదేశించారు. కాగా, ఇదే జిల్లాలో గతేడాది రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ఘటనలో లోకోపైలట్, ఆయన అసిస్టెంట్‌కు గాయాలయ్యాయి. మరోవైపు ఈ ఘోర రైలు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆదివారం ఈజిప్ట్‌లో డిమాండ్లు వెల్లువెత్తాయి.

అలా చేస్తే ప్రజలు ఉరికించి కొడతారు

మొదటిపేజీ తరువాయి...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తున్నాయనే సంకేతం ప్రజలకు ఇస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లాకు మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్రానికి ఇతర మంత్రుల సహకారంతో నిధులు తీసుకొస్తున్నామని తెలిపారు. అలాగే, కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు, మ్యాచింగ్ గ్రాంట్స్ తీసుకొస్తున్నామని చెప్పారు. అందువల్లే అభివృద్ధి ముందుకు సాగుతుందని తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్‌కు అన్ని మార్గాల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగుతున్నామని బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ డంపింగ్ యార్డ్ గురించి ప్రణాళిక రచిస్తున్నామని... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సమస్యను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే టెండర్ ప్రాసెస్ మొదలైందని, అయితే దానిని వివాదాస్పదం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కరీంనగర్ జిల్లాలలో కొందరు నాయకుల వ్యవహార శైలి వారు అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా ఉంటుందని... అధికారంలో లేనప్పుడు ఇంకొకరిని పనిచేయకుండా చేస్తారని మండిపడ్డారు. కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని బండి సంజయ్ తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లు.. కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నాయకుల వ్యవహారశైలి వల్ల కాంట్రాక్టర్లు భయపడే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఇలాంటి పిచ్చి పిచ్చి రాజకీయాలు చేస్తే ప్రజలు ఉరికించి కొడతారని చెప్పుకొచ్చారు. " రాసి పెట్టుకోండి, మళ్లీ చెప్తున్నాను... ప్రజల్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే అక్కడి ప్రజలే ఉరికించి కొడతారు" అని బండి సంజయ్ అన్నారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్..

మొదటిపేజీ తరువాయి...

ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రాల క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో ఈసీ ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తుంది.ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ (డీఈసీ) స్థాయి బృందాలు పలు రాష్ట్రాల్లో పర్యటించి సన్నాహక పనులను సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ బృందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక దఫా పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో డీఈసీ బృందం ఇంకా పర్యటించలేదు. నవంబర్ నెలాఖరు నాటికి ఈ బృందాలు తమ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నాయి. పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తోంది. అయితే, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. జనాభా పరంగా, భౌగోళికంగా పెద్దదైన ఉత్తరప్రదేశ్‌లో మాత్రం బహుళ దశల్లో ఎన్నికలు నిర్వహించే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రాల్లో పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అధికారుల అభిప్రాయాలను సమగ్రంగా విశ్లేషించిన తర్వాత, షెడ్యూల్ పై ఈసీ తుది నిర్ణయం తీసుకోనుంది.

ఈనెల 11న నిర్మల్‌లో కేటీఆర్ రైతు గర్జన సభను విజయవంతం చేయాలి



దస్తురాబాద్: ఈ నెల 11న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రైతు గర్జన సభ ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ దస్తురాబాద్ మండల అధ్యక్షుడు ముడికె ఐలయ్య యాదవ్ పిలుపునిచ్చారు. రైతు గర్జన సభకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారని తెలిపారు. సోమవారం దస్తురాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు.రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న రైతు గర్జన సభకు మండలంలోని రైతులు, రైతు సమితి నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. గ్రామగ్రామాన పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సభకు జనసమీకరణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్‌లో దీపావళి విషాదం

మొదటిపేజీ తరువాయి...

మూడు అంతస్తుల భవనంలో కింద క్రాకర్ షాపు ఉన్నది. అయితే పైఅంతస్తులో ఓ కుటుంబం నివసిస్తోంది. రాత్రి ప్రమాదం జరగడంతో మంటలు పైకి వ్యాపించాయి. నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో ఆరుగురు కాలి బూడిదయ్యారు. మృతులను పూరన్ అగర్వాల్, చంద్రకళ, పూనమ్, ఆర్యా, అన్వీగా గుర్తించారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. తెల్లవారుజామున మృతదేహాలను వెలికితీశారు. షార్ట్ సర్క్యూట్ లేదా దీపాల వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక సియోనీ జిల్లాలోని చాపారా పట్టణంలో మరో ప్రమాదం జరిగింది. ఓ నగల వ్యాపారి ఇంట్లో ప్రమాదం జరగడంతో ఆరుగురు మృతిచెందారు.

మృతులను కుందన్ లాల్ సోనీ, రాజ్‌కుమారి సోనీ, రీతూ సోనీ, స్మృతి సోనీ, సూర్య సోనీ, ఆదిత్య సోనీగా గుర్తించారు. మరో నలుగురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అగ్నిప్రమాద సమయంలో ఇంట్లో పది మంది ఉన్నారు. గాఢ నిద్రలో ఉనప్పుడు ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. రెండు ఘటనలు మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

ఇరాన్‌పై మళ్లీ యుద్ధం.. అత్యంత అసంభవం

మొదటిపేజీ తరువాయి...

పశ్చిమాసియాలో అమెరికా 3 విమాన వాహక యుద్ధనౌకలను మోహరించిందని, అవి పూర్తిస్థాయిలో పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలు సహా కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా గుర్తించినట్లు వెల్లడించారు. అయితే.. వాటిని ధ్వంసం చేస్తే పునర్నిర్మాణానికి పదేళ్ల సమయం పట్టొచ్చని, అందుకే అలాంటి చర్యలు తీసుకోవడం తనకిష్టం లేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పశ్చిమాసియా దేశాలు దౌత్య ప్రయత్నాలను వేగవంతం చేశాయి. ఖతార్ రాజుతో ట్రంప్ చర్చలు జరిపారు. మరోవైపు.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, పాకిస్థాన్, టర్కీ సహా పలు దేశాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. అయితే.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాత్రం చర్చల్లో తక్షణ పురోగతి కనిపిస్తోందని చెప్పలేమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవని ఆయన వ్యాఖ్యానించారు.

సంపాదకీయం

ఐడీబీఐ వాటాలపై అనుమానాలు

బిజెపి ప్రభుత్వం మరో ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. 1964లో పారిశ్రామిక అభివృద్ధి రుణాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పరచిన ప్రభుత్వ రంగ బ్యాంకు ఐడిబిఐ ని కెనడాకు చెందిన ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్స్‌కి కేంద్రం అప్పగిస్తోంది. అక్టోబర్ 14న కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి ఆమోద ముద్రవేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ బ్యాంకుపై అధికారం చేతులు మారిపోతుంది. బ్యాంకుల విస్తరణ కారణంగా ఐడిబిఐ 2015లో పబ్లిక్ సెక్టర్ బ్యాంకుగా మారిపోయింది. ప్రస్తుతం అది మిగతా వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే శాఖల ఏర్పాటుతోపాటు సేవలు అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 2100 శాఖలు ఉన్న ఈ బ్యాంకులో 20వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2015-16 లో ఈ బ్యాంకును మూల ధన కొరత, నిరర్థక ఆస్తుల పెరుగుదల లాంటి చిక్కులను ఎదుర్కొని రూ. 3వేల కోట్ల నష్టాలను మూట కట్టుకుంది. ఈ విపత్తు నుండి బ్యాంకును బయటపడేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసినీ వాడుకుంది. రూ. 22వేల కోట్లు వెచ్చించి ఎల్ఐసి ఈ బ్యాంకులో సుమారు సగం వాటాను సొంతం చేసుకుంది. అలా బలపడిన ఐడిబిఐ ఇప్పటికీ లాభాల బాటలోనే నడుస్తోంది. ఆనాటి వాటా అమ్మకంవల్ల ఈ బ్యాంకుపై హక్కులు 45.48% కేంద్ర ప్రభుత్వానికి, 49.24% ఎల్ఐసికి చెందుతాయి. ఇందులోంచి ఇప్పుడు కేంద్రం 30.48%, ఎల్ఐసి 30.24% వాటాను ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌కి అమ్మేస్తున్నాయి. వాటి మొత్తం విలువ రూ. 53 వేల కోట్లు. జులైలో జరిగిన వేలం పాటలో ఆ ఒక్క సంస్థే పాల్గొనడంతో ఈ ఒప్పందం కుదిరింది. ఇందువల్ల రూ. 81 ఉన్న బ్యాంకు షేర్ విలువను రూ. 76కు తగ్గించవలసి వచ్చింది. ఎల్ఐసికి మిగలబోయే 19% వాటాను కూడా త్వరలోనే బహిరంగ మార్కెట్ ద్వారా అమ్మేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఐడిబిఐలో ఈ వాటాను కొనుగోలు చేసి బ్యాంకుపై పెత్తనం పొందుతున్న ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్ సంస్థ యజమాని వివియన్ ప్రేమ్ వత్స. అతను ప్రవాస భారతీయుడు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఐఐటి మద్రాస్‌లో చదివాడు. కెనడా వెళ్లి ఒక దివాళా తీసిన బీమా కంపెనీని కొని ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌గా పేరు మార్చి లాభాలు గడిస్తూ ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగారు. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పుడు ఐడిబిఐని కొనుగోలు చేస్తున్నారు. బలమైన పునాదులున్నప్పటికీ సంక్షోభంలో ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడమే ప్రేమ్ వత్సా విజయానికి ప్రధాన సూత్రం.అలాంటి కంపెనీలను గుర్తించడంలో ఆయనకు అసాధారణమైన సామర్థ్యం ఉంది. అంతేకాదు, వాటిలో దీర్ఘకాలం పెట్టుబడులను కొనసాగించే సహనం కూడా ఉంది.కాలగమనాన్ని అంచనా వేయడంలోనూ వత్సా దిట్ట. సంక్షోభం రాబోతోందన్న సంకేతాలను ముందుగానే పసిగట్టగలరు. ఈ సామర్థ్యంతోనే 1987లో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల పతనాన్ని, బ్లాక్ మండేగా ప్రసిద్ధి చెందిన పరిణామాన్ని, 1990లో జపాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడాన్ని, 2008లో సబ్‌ప్రైమ్ సంక్షోభంగా పిలిచే అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని ఆయన ముందుగానే గుర్తించారు.ఆ సమయంలో అమెరికా ఆర్థిక మందగమనాన్ని అవకాశంగా మలుచుకున్న ప్రేమ్ వత్సా, భవిష్యత్తులో మంచి పనితీరు కనబరిచే అవకాశమున్న కంపెనీల షేర్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు.అయితే, ఫెయిర్‌ఫాక్స్ కూడా ఎదురుదెబ్బలు చవిచూసింది. హార్వీ, ఇర్మా, మారియా తుపానులతో పాటు కాలిఫోర్నియాలో చెలరేగిన కార్చిచ్చుల వల్ల సంస్థకు గణనీయమైన నష్టాలు వచ్చాయి.కోవిడ్-19 మహమ్మారి కూడా సంస్థకు పెద్ద సవాలుగా మారింది. ఆ సమయంలో దాని బీమా వ్యాపారం భారీ నష్టాలను చవిచూసింది.అయితే, ప్రేమ్ వత్సా సామర్థ్యం ఫెయిర్‌ఫాక్స్‌ను మళ్లీ పుంజుకునేలా చేసింది.2022 అక్టోబర్‌తో పోలిస్తే 2025లో ఫెయిర్‌ఫాక్స్ విలువ నాలుగు రెట్లు పెరిగింది.ఫెయిర్‌ఫాక్స్ వ్యాపార వ్యూహం విజయవంతమైంది.బీమా క్లెయిమ్‌లు చెల్లించాల్సిన సమయం రాకముందే భారీ మొత్తంలో ప్రీమియంలను వసూలు చేసి, బలమైన పునాదులున్నప్పటికీ తక్కువ ధరకు లభించే షేర్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా సంస్థ విజయాన్ని సాధించింది.వ్యాపార, పారిశ్రామిక రంగాలకు చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా ప్రేమ్ వత్సాకు పద్మశ్రీ పురస్కారం లభించింది.ఇప్పటికే ఆయన 2016 లో రూ. 1180 కోట్లతో కేరళంలోని సిఎస్‌బి బ్యాంకులో 51% వాటా సొంతం చేసుకున్నారు. 2020 లో భారత కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించడం విశేషం. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం ఒక విదేశీయుడు దేశంలోని రెండు బ్యాంకులను హస్తగతం చేసుకోరాదు. ఈ లెక్కన ఫెయిర్ ఫ్యాక్స్ సంస్థ ఒక బ్యాంకు నుంచి వైదొలగాలి లేదా రెండు బ్యాంకులను కలిపేసి ఒక్క బ్యాంకుగా మార్చాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటాలను బహిరంగంగా అమ్మేస్తూ, వాటిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచుతూ దేశ బ్యాంకింగ్ రంగాన్ని బలహీనపరుస్తోంది. బ్యాంకులను జాతీయం చేసిన లక్ష్యాలకు అవి దూరమవుతున్నాయి. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలు, ఆందోళనలు చేపట్టినా వాటి ప్రభావం ప్రభుత్వ చర్యలపై పెద్దగా ఉండడం లేదు. ఐడిబిఐని బాహాటంగా అమ్మేయడమే దీనికి తార్కాణం. దేశంలోని రెండు బ్యాంకులను ఒకే విదేశీ సంస్థ కొనుగోలు చేయడం వల్ల ఆ రెండు బ్యాంకుల ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఒక బ్యాంకులోంచి వాటా వెనక్కి తీసుకొనే బదులు రెండింటిని కలిపి వేయడానికే యాజమాన్యం మొగ్గు చూపుతుంది. ప్రైవేటు చేతుల్లోకి వెళ్లి తమ అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఐడిబిఐ ఉద్యోగులు సిద్ధంగా లేరు. ఇప్పటికే ఫెయిర్ ఫాక్స్ సొంతమైన సిఎస్‌బి ప్రైవేటు బ్యాంకు, ఐడిబిఐ ప్రభుత్వ రంగ బ్యాంకు. ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటు చేతుల్లోని వెళితే దాని ప్రభావం ఉద్యోగుల పని భారం, వేతనాలపై అధికంగా పడుతుంది. ఇక నుంచి ఐడిబిఐ ఉద్యోగుల వేతన సవరణ మిగతా జాతీయ బ్యాంకుల ఉద్యోగుల మాదిరిగా ఉండదు. జరగబోయే ఉద్యోగ నియామకాల్లో, ప్రమోషన్లలో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఉండవు. ఉద్యోగ భద్రత విషయంలో ఐడిబిఐ సిబ్బంది ఎంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ వారు ఇప్పటికే ఉద్యమం బాటపట్టారు. ఈ నెల 2, 3 తేదీల్లో బ్యాంకులు మూసేసి సమ్మెలో పాల్గొన్నారు. దీపావళి తర్వాత పూర్తి స్థాయి కార్యాచరణ ఉంటుందని వారి నేతలు అంటున్నారు. ప్రభుత్వం తగిన హామీలు ఇవ్వకుంటే తమ ప్రతిఘటనను తీవ్రతరం చేస్తామని, దేశంలోని అన్ని బ్యాంకు ఉద్యోగ సంఘాలను సంప్రదించి, వారి ఐక్యతతో దేశవ్యాప్త నిరసనలు చేపడతామని అంటున్నారు. సాంకేతికత పైచేయి వల్ల ఉద్యోగ శక్తి బలహీనపడి ప్రభుత్వాలకు ఎదురు లేకుండాపోయింది. బ్యాంకుల కంప్యూటరీకరణ ఉద్యోగుల ప్రమేయాన్ని తగ్గించింది. ఏ ప్రభుత్వ రంగ సంస్థనైనా కేంద్రంలో ఉన్న బిజెపి కూటమి తన ఇష్టారాజ్యంగా అంగట్లో పెడుతోంది. ఇది కేవలం ఐడిబిఐ సమస్యే అనుకోరాదు. పాలన ఇలాగే ఉంటే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఎదురుకావచ్చు.

భూముల అమ్మకమే ఆదాయ మార్గమా...!



హైదరాబాద్, : మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి భారీ విజయాన్ని అందించింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత విలువైన ప్రభుత్వ భూములపై హక్కులను రాష్ట్రం తిరిగి సాధించుకుంది. అయితే ఈ భూములను విక్రయించి ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు తెరలేపింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన భూముల విక్రయ విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, వాటి వినియోగం ఇప్పుడు రాజకీయంగా కీలక అంశంగా మారింది. మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు రావడం ప్రభుత్వానికి పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు న్యాయపోరాటం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. అయితే ఈ విజయం తర్వాత ఆ భూములను అమ్మి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చుకోవాలన్న రేవంత్ రెడ్డి ఆలోచన మాత్రం ఆర్థిక విధానంపై చర్చకు దారితీస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వ భూకేటాయింపులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో హిల్స్ వంటి భూముల కేటాయింపుల విషయంలో కేసీఆర్, హరీశ్ రావు గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. పదేళ్ల అధికారంలో వాటిని ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఒక వైఖరి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో వైఖరి ఎందుకు అనుసరించారని నిలదీస్తున్నారు.అంతేకాకుండా కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలో శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ ఏర్పాటు చేస్తామని రేవంత్ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందించాలన్నది ఈ ప్రతిపాదన లక్ష్యంగా పేర్కొన్నారు. ఎర్రవల్లి, షేర్ వెంకటాపూర్ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల వ్యవహారంపైనా ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇప్పటివరకు 345 ఎకరాలను మాత్రమే గుర్తించారని, మరో 43 ఎకరాల ఆచూకీ తేలాల్సి ఉందని వెల్లడించారు. ఈ రెండు గ్రామాల్లో సమగ్ర భూ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూమిలేని అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అయితే ప్రభుత్వ భూములను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవడం తెలంగాణలో కొత్త విధానం కాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. 2021 జూలైలో కోకాపేటలో దాదాపు 50 ఎకరాల భూములను వేలం వేయడం ద్వారా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూర్చుకుంది. 2023 ఆగస్టులో కోకాపేట, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన భూముల వేలం ద్వారా సుమారు రూ.7,100 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది.నియోపోలిస్ భూముల వేలం ద్వారా రూ.3,319.60 కోట్లు, బుద్వేల్ భూముల ద్వారా రూ.3,625.73 కోట్ల ఆదాయం లభించింది. అంతేకాకుండా ఔటర్ రింగ్ రోడ్డును టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రైవేట్ సంస్థకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం ముందస్తుగా రూ.7,380 కోట్ల ఆదాయాన్ని పొందింది. అంటే ప్రభుత్వ ఆస్తులను నగదుగా మార్చుకోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలోనూ కీలక భాగంగా ఉంది.అయితే భూముల అమ్మకాల ద్వారా భారీ ఆదాయం వస్తుందని అంచనా వేసినా, ఆ అంచనాలను వాస్తవ ఆదాయంతో సరిపోల్చడంలో గత ప్రభుత్వం విఫలమైందని కాగ్ నివేదికలు తప్పుబట్టాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నివేదికలో భూములు, ఆస్తుల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై ప్రభుత్వం అధిక అంచనాలు వేసిందని కాగ్ ప్రస్తావించింది. గత అంచనాలు నెరవేరకపోయినా మళ్లీ భారీ ఆదాయ అంచనాలు చూపించడం ఆర్థిక నిర్వహణలో సమస్యలకు దారితీస్తుందని సూచించింది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ప్రభుత్వ భూములు ఒక పరిమితమైన సంపద. ఒకసారి వాటిని విక్రయిస్తే తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం అంత సులభం కాదు. పాఠశాలల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు అత్యంత అవసరమైనవే. కానీ అలాంటి పథకాల కోసం ప్రభుత్వ భూములను విక్రయించడమే ప్రధాన ఆదాయ మార్గంగా మారితే భవిష్యత్తులో పరిస్థితి ఏమిటన్నది ఆలోచించాల్సిన అంశం.ముఖ్యంగా ఒకసారి వచ్చే భూముల అమ్మకాల ఆదాయాన్ని ప్రతి ఏడాది ఖర్చు చేయాల్సిన సంక్షేమ పథకాలకు ఉపయోగించడం ఆర్థికంగా ఎంతవరకు సమంజసం? ప్రభుత్వ పాఠశాలలు, సాగునీటి ప్రాజెక్టుల వంటి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆ నిధులను వినియోగించడం ఒక కోణమైతే, నిరంతరం ఖర్చు చేయాల్సిన పథకాలకు ఒకేసారి వచ్చే ఆదాయాన్ని ఆధారంగా చేసుకోవడం మరో కోణం. సంక్షేమ పథకాలకు ప్రతి సంవత్సరం స్థిరమైన ఆదాయ వనరులు అవసరం. భూముల అమ్మకాల ద్వారా వచ్చే డబ్బు ఎప్పటికీ అందుబాటులో ఉండదు.గత ప్రభుత్వ భూవ్యవహారాలను ప్రశ్నిస్తున్న రేవంత్ రెడ్డికి ఇప్పుడు తన విధానాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. మియాపూర్ భూములను విక్రయించాలని నిర్ణయిస్తే.. వాటి ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? ఆ నిధులను ఏయే పథకాలకు కేటాయిస్తారు? వాటి వినియోగంపై ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది? భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు కరిగిపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందుంచాలి.ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణల నుంచి కాపాడటం ఎంత ముఖ్యమో, వాటిని భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంచడం కూడా అంతే ముఖ్యం. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు దక్కిన విజయం. ఆ విజయాన్ని మరో భూముల విక్రయానికి అవకాశంగా చూడటం మాత్రం సరైన విధానం కాకపోవచ్చు.కేసీఆర్ ప్రభుత్వం భూముల విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకునే విధానానికి బలమైన, దీర్ఘకాలిక ఆర్థిక ప్రత్యామ్నాయాన్ని చూపించలేకపోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు అదే విధానాన్ని విమర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడిస్తే తేడా ఏముంటుంది? రాజకీయ విమర్శలకు అతీతంగా ప్రజా ఆస్తుల నిర్వహణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాల్సిన బాధ్యత రేవంత్ ప్రభుత్వంపై ఉంది.ప్రభుత్వాలు భూములను అమ్మి తాత్కాలికంగా డబ్బు సమకూర్చుకోవడం కంటే, కొత్త సంపదను సృష్టించడం, ఆదాయ వనరులను పెంచడం, ప్రభుత్వ ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలి. రాజకీయ హామీల అమలు కోసం తరతరాల సంపదను విక్రయించడం తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత ఆర్థిక విధానం కాదు. తెలంగాణ భవిష్యత్తు కోసం భూముల అమ్మకాల కంటే స్థిరమైన ఆదాయ మార్గాలే కీలకం.

ఛత్తీస్‌గఢ్‌లో డబ్బు కోసం దారుణ హత్య



- ఆన్‌లైన్‌లో అమ్మేందుకు బాలుడి అవయవాలు సేకరణ
- సోషల్ మీడియా వీడియోలు చూసి నేరానికి పాల్పడిన నిందితుడు
- మద్యం తాగించి, గొంతు కోసి చిన్నారిని చంపిన కిరాతకుడు
- నిందితుడిని అరెస్ట్ చేసి, అవయవాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఛత్తీస్‌గఢ్: త్వరగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. నాలుగేళ్ల బాలుడిని అత్యంత కిరాతకంగా హత్య చేసి, అతడి శరీరంలోని అవయవాలను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు ప్రయత్నించాడు. సోషల్ మీడియాలో చూసిన వీడియోల ప్రభావంతో ఈ ఘోరానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈ అమానవీయ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని జష్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సన్నా పోలీస్ స్టేషన్ పరిధిలోని చల్నీ గొర్రాపథ్ గ్రామానికి చెందిన బసుదేవ్ (27) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తన సంపాదనతో అసంతృప్తిగా ఉన్న అతడు, సులభంగా డబ్బు సంపాదించే మార్గాల కోసం తరచూ సోషల్ మీడియాలో వెతికేవాడు. ఈ క్రమంలోనే పిల్లల అవయవాలను అమ్మి డబ్బు సంపాదించవచ్చనే ఆలోచనకు వచ్చాడు. నవంబర్ 5వ తేదీన, తన బంధువు కుమారుడైన నాలుగేళ్ల జితేంద్ర రామ్‌ను మాయమాటలతో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ బాలుడికి మద్యం తాగించి, మత్తులోకి జారుకున్న తర్వాత కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం బాలుడి శరీరాన్ని కోసి కిడ్నీలు, ఊపిరితిత్తులు, కళ్లను వేరు చేసి ఒక ప్లాస్టిక్ బకెట్‌లో ఉంచాడు. మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, గోనె సంచిలో కుక్కి సమీపంలోని మొక్కజొన్న తోటలో నీటి గుంతలో పూడ్చిపెట్టాడు. నవంబర్ 5 నుంచి కుమారుడు కనిపించకపోవడంతో, అతడి తండ్రి రామ్‌జీత్ రామ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాలింపు చర్యలు చేపట్టగా, ఆదివారం గుంతలో పాక్షికంగా పూడ్చిపెట్టిన మృతదేహాన్ని గుర్తించారు. అనుమానంతో బసుదేవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, అవయవాలు ఉన్న బకెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జష్‌పూర్ ఎస్ఎస్పీ లాల్ ఉమేద్ సింగ్ తెలిపారు.

మా ఇందిరమ్మ ఇంట్లో ఇంటింటా దీపావళి, పేదవాడి కళ నెరవేరిన శుభవేళ



కేసముద్రం: మున్సిపాలిటీ(పరిధి) కేసముద్రం (విలేజ్) లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధికారులు పాల్గొని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల దంపతులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచారు రాష్ట్ర ప్రభుత్వం గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి వాళ్ళ స్థిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ఎంతో సంతోషంగా ఉన్నారని దేశ స్వతంత్రం వచ్చినప్పటినుండి కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు అండగా పేదల కల నెరవేర్చి పార్టీగా పేదల గుండెల్లో స్థిరంగా ఉండిపోయిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసముద్రం విలేజ్ వైస్ ప్రెసిడెంట్ కత్తెరసాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్ల రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కీర్తి సురేందర్, బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మాసాడి శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అజ్మీర రమేష్, సుసకన్ల సుభాష్ రెడ్డి, కీర్తి శ్రీలత, చిట్ల సులోచన, హౌసింగ్ ఏఈ అభినయ్ గౌడ్ మున్సిపల్ వార్డు ఆఫీసర్ కృష్ణమూర్తి, బిల్ కలెక్టర్ రోమన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ వార్డ్ మెంబర్ గుండు లక్ష్మీనారాయణ, పెండ్యాల లక్ష్మణ్, బొల్లా అశోక్, ఉల్లి వెంకటేశ్వర్లు, జిలకర బాబు, కొలిపాక శ్రీనివాస్, వల్లందాస్ దేవదానం, కట్కూరి జనార్దన్, ఎస్.కే. యాకుబి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇందిరమ్మ లబ్ధిదారులు అయిన కట్కూరి పద్మా జనార్ధన్, నాగబెల్లి సావిత్ర లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారుల దంపతులు వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ ఉమా మురళి నాయక్ కు ధన్యవాదాలు తెలిపారు.

'వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలి'

- గైనకాలజిస్ట్ రోజు విడిచి రోజు రావడం పట్ల కలెక్టర్ అంకిత్ అసహనం
- బూర్గంపహాడ్ సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



బూర్గంపహాడ్, నవంబర్ 09 : ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం బూర్గంపహాడ్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది, వైద్యుల హాజరు, రోగులకు అందిస్తున్న సేవలు, మందుల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంపై మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. గైనకాలజిస్ట్ రోజు విడిచి రోజు విధులకు హాజరవుతున్నారని మెడికల్ అధికారి తెలపడంతో కలెక్టర్ డీసీహెచ్ఎస్‌కు ఫోన్ చేసి గైనకాలజిస్ట్ ప్రతిరోజూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, మహిళా రోగులకు వైద్య సేవలందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రక్త పరీక్షల కేంద్రాన్ని సందర్శించి పరీక్షల సంఖ్య, అందుబాటులో ఉన్న పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించి చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలు, ఎదురయ్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అన్నారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా నిరంతరం పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇన్ పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల తయారీ కేంద్రాన్ని పరిశీలించి వంట మనిషితో మాట్లాడి రోగులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, తయారీలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఇన్ పేషెంట్ వార్డులో 15 మంది రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం నూతన ఆస్పత్రి భవనాన్ని నిర్మాణ పూర్తిపై ఆరా తీశారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గడ్డం ప్రసాద్, వైద్యులు అమరేందర్‌రెడ్డి, ఇతర వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

నల్గొండలో కారుణ్య నియామకం స్కాం

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ఉద్యోగం.. 14 మంది అరెస్ట్

- రిటైర్ అయ్యాక చనిపోయిన ఉద్యోగిని సర్వీసులో మరణించినట్లు సృష్టించిన వైనం
- ఉద్యోగం కోసం రూ.13 లక్షలతో ఒప్పందం చేసుకున్న కుటుంబ సభ్యులు
- మృతుడి కుటుంబం, అధికారులు సహా 14 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ప్రధాన సూత్రధారితో పాటు మరో ఇద్దరు పరారీలో



నల్గొండ : నల్గొండ జిల్లా వైద్యారోగ్య శాఖలో సంచలనం సృష్టించిన నకిలీమరణ ధ్రువీకరణ పత్రం కేసులో పోలీసులు 14 మందిని అరెస్ట్ చేశారు. పదవీ విరమణ తర్వాత మరణించిన ఉద్యోగిని, సర్వీసులో ఉండగానే చనిపోయినట్లు నకిలీ పత్రాలు సృష్టించి ఆయన కుమారుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించిన ఈ ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసిన చామకూరి వెంకటేశ్వర్లు, 2025 మే 31న పదవీ విరమణ చేశారు. అనారోగ్యంతో అదే ఏడాది నవంబర్ 17న ఆయన మరణించారు. అయితే, కారుణ్య నియామకం నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ తర్వాత మరణిస్తే ఉద్యోగం రాదు. దీంతో, ఆయన కుటుంబ సభ్యులు కొందరు అధికారులతో కుమ్మక్కై భారీ స్కెచ్ వేశారు. వెంకటేశ్వర్లు సర్వీసులో ఉండగానే, అంటే 2025 మే 28న చనిపోయినట్లు నకిలీ రికార్డులు తయారు చేశారు. ఇందుకోసం ముందుగా ఆయన ఆధార్ కార్డులోని చిరునామాను మీ-సేవా కేంద్రం ద్వారా నల్గొండ పట్టణానికి మార్చారు. ఆ తర్వాత నల్గొండ మున్సిపాలిటీ అధికారుల సాయంతో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందారు. ఈ నకిలీ పత్రాలను ఉపయోగించి వెంకటేశ్వర్లు కుమారుడు చామకూరి రాజుకు దామరచర్ల పీహెచ్‌సీలో ఉద్యోగం ఇప్పించారు. ఈ ఉద్యోగం కోసంసుమారు రూ.13లక్షలడీల్ జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. మృతుడి భార్య వసంత, డీఎంహెచ్‌వో కార్యాలయ సీసీ పోలె రంజిత్ కుమార్‌తో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు గుర్తించారు. ఈ మోసంపై నల్గొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ నవంబర్ 4న ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. లోతుగా దర్యాప్తు చేపట్టి మృతుడి భార్య వసంత, కుమారుడు రాజు, బంధువులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్ శివ జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి సహా మొత్తం 14 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.5 లక్షల నగదు, కంప్యూటర్, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

జగన్, కేటీఆర్, విజయ్...

ఆదానీ రాయబారమా...బేరమా..!

చెన్నై, నవంబర్ 9,: సౌత్ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారిన కీలక అంశం వైసిపి అధినేత జగన్ అలాగే ప్రముఖ పారిశ్రామికవేత్త కేంద్ర ప్రభుత్వంతో అత్యంత దగ్గర సంబంధాలు నడుపుతున్న గౌతం అదాని.. వీరిద్దరూ చెన్నైలో భేటీ కావడం. సుమారు గంటన్నర పాటు పరస్పరం ఒక హోటల్లో ఏకాంతంగా కలుసుకుని చర్చించారు అన్నది ఇప్పుడు రాజకీయంగా కీలక అంశంగా మారింది. వచ్చే ఎన్నికల నాటికి అధికారంలోకి వస్తామని, రావాలని భావిస్తున్న వైసిపి ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరి ప్రయాణం సాగిస్తోంది. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్ర పార్టీలతో పొత్తు పెట్టుకుని వడి వడిగా ముందుకు సాగుతోంది. ఇటువంటి సమయంలో బిజెపికి అత్యంత సన్నిహితుడిగా ముఖ్యంగా బీజేపీ అగ్ర నేతలకు అత్యంత మిత్రుడుగా ఉన్న ఆదానితో జగన్ రెడ్డి భేటీ కావడం అనేది సహజంగానే రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. అయితే, నిజంగానే వీరు మధ్య రాజకీయంగా చర్చ నడిచిందా లేదా అనేది ప్రస్తుతం ఇది ఊహలకి మాత్రమే పరిమితమైంది. దీనిపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. అయితే ఒకటి మాత్రం వాస్తవం జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆదాని పోర్టులు కావచ్చు, ఇతర రూపాల్లో కావచ్చు విద్యుత్తు ఒప్పందాల్లో కావచ్చు ఆయనకు జగన్ సహకరించారు అన్నది వాస్తవం. అలాగే అదానికి ..ముకేశ్ అంబానీ కి మిత్రుడైన పరిమళనత్వానికి రాజ్యసభ సీటు కూడా ఇచ్చారు. సో ఇవన్నీ జాతీయ స్థాయిలో వ్యాపార వర్గాలకు జగన్‌కు మధ్య బంధాన్ని బలోపేతం అయితే చేసింది. అలాగే విశాఖపట్నంలో డేటా సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు కూడా ఆదానికి అప్పట్లోనే.. జగన్ పచ్చ జెండా ఊపడం ఇటీవల వార్తల్లోనూ కనిపించింది. ఇక సోలార్ విద్యుత్ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల ఒప్పందాలు వంటివి కూడా జగన్ హయాంలోనే జరిగాయి. అంటే ఒక రకంగా ఆదానికి జగన్కు మధ్య వ్యాపార పరమైన సంబంధాలు బాగానే ఉన్నాయి. ఇప్పుడు అవి పొలిటికల్ గా మారుతున్నాయా నిజంగానే పొలిటికల్గా అలానే జగన్‌కు ఏమన్నా హెల్ప్ చేయాలని భావిస్తున్నారా అంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాకపోవచ్చు అనేది విశ్లేషకుల అంచనా. ఎందుకంటే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంతో కూడా ఆదాని రాజకీయంగా కంటే వ్యాపార పరంగానే ఒప్పందాలు చేసుకున్నారు.. అలాగే సౌర విద్యుత్ ఒప్పందాలు కొనసాగుతున్నా యి. స్మార్ట్ మీటర్ల మార్పిడి జరుగుతుంది. సో ఇవన్నీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయనకు అనుకూలంగా ఉండబట్టే జరుగుతున్నాయి అన్నది వాస్తవం. కాబట్టి ఈ సమయంలో జగన్‌తో ఏకపక్షంగా రాజకీయాలపై చర్చిస్తారని, రాజకీయంగా ఆయనకు దోహదపడతారని అనడంలో ఎలాంటి నమ్మదగిన సమాచారం లేదనే చెప్పాలి. వ్యాపారవేత్తగా ఆదానీ బలమైన రోల్ పోషిస్తున్నారు. అందులో సందేహం లేదు. ఇదే సమయంలో జగన్ ఆయనకు సహకరించారు దానికీ సందేహం లేదు. ఈ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుని భవిష్యత్తులో జగన్‌కు ఆదాని దోహద పడతారు లేదా బీజేపీతో రాయబారం చేస్తారు అనడంలో మాత్రం అనే అనుమానాలు ఉన్నాయి. ఖచ్చితంగా ఇవి జరిగే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు గట్టిగా చెబుతున్నారు. ఒక వ్యాపారవేత్త రాజకీయంగా ఏదైనా డబ్బులు సంకూర్చవచ్చే తప్ప మధ్యవర్తిగా పనిచేసే అవకాశాలు తక్కువని పైగా కూటమి బలంగా ఉన్న ఈ నేపథ్యంలో జగన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తే ఆయన వ్యాపారాలకు దెబ్బ పడే అవకాశం ఉంటుందని కూడా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బొత్సకు చెక్..!



విజయనగరం, నవంబర్ 9,: విజయనగరం జిల్లా రాజకీయాల్లో తిరుగు లేని చక్రం తిప్పిన వైసీపీ లీడర్, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధిపత్యానికి చెక్ పడినట్టేనా? అని స్థానిక రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తుంది. ముఖ్యంగా జడ్పీటీసీ ఎన్నికల పోరులో బొత్స ఫ్యామిలీకి తగిన ఎదురు దెబ్బ వల్ల ఈ విశ్లేషణలు మొదలయ్యాయి. బొత్స వర్గీయులకు ఈ ఎన్నికల ఫలితాలు మింగుడుపడని చేదు అనుభవాన్ని మిగిల్చాయి. అందులోనూ విజయనగరం కోటలో కూటమి జెండా రెపరెపలాడటం బొత్స పొలిటికల్ పవర్ పతనానికి నాంది అని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ జడ్పీ ఎన్నికల్లో తన పట్టు నిలుపుకునేందుకు ప్రతిష్టాత్మకంగా తీ[redacted]కి దీ[redacted]వి.

ముఖ్యంగా పూసపాటిరేగ నుంచి తమ్ముడి కుమారుడి చైతన్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. అలాగే బొండపల్లిలో కుమార్తె బొత్స అనూష ఘోర పరాజయం పాలయ్యారు. జడ్పీ ఛైర్‌పర్సన్‌గా చూడాలనుకున్న బొత్స అనూష.. టీడీపీ అభ్యర్థి చేతిలో సుమారు 5 వేల ఓట్ల తేడాతో ఓడిపోవడం బొత్సకు కోలుకోలేని దెబ్బ పడింది. అయితే కేవలం గరివిడి నుంచి కోడలు పూజిత, గుర్ల నుంచి సోదరి మాత్రమే స్వల్ప మెజార్టీలతో గట్టెక్కారు.జిల్లా రాజకీయాల్లో బొత్సకు ఈ స్థాయిలో దెబ్బ తగలడంలో ఆయన మేనల్లుడి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పాత్ర కీలకంగా మారిందని స్థానిక అధికార, ప్రతిపక్ష పార్టీల వర్గీయుల్లో చర్చ సాగుతుంది. సరిగ్గా ఏపీ స్థానిక ఎన్నికలకు ముందే తెలుగుదేశంలో చిన్న శ్రీను.. తన కుమార్తె సిరి సహస్రను తెర్లాం జడ్పీటీసీగా బరిలో దింపి ఘన విజయం సాధించారు. సిరి సహస్రను దెబ్బకొట్టడానికి ప్రత్యర్థులు నానా ప్రయత్నాలు చేశారు. కానీ అవేమి ఫలించ లేదని భారీగా పడిన ఓట్లే నిదర్శనంగా మారాయి. అంతేకాదు అధినేత చంద్రబాబు హామీ మేరకు సిరి సహస్రకు జడ్పీ పీఠం దక్కే అవకాశం ఉందనే టాక్ నడుస్తుంది. ఇది బొత్సకు రాజకీయంగా మరో పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు.ఇక జిల్లాలో 27 జడ్పీటీసీ స్థానాల్లో 22 చోట్ల కూటమి జైత్రయాత్ర సాగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 5 స్థానాలకే పరిమితం అయింది. ఈ స్థానాల్లో గెలిచిన వారంతా స్వల్ప మెజార్టీతోనే గెలిచారు. దీంతో జిల్లాలో బొత్స ఆధిపత్యానికి చెక్ పడిందనడానికి ఇదే నిదర్శనమని అందరూ అనుకుంటున్నారు. అయితే సాధారణంగా అధికార పార్టీ ఎవరైతే ఉంటుందో.. ఆ పార్టీదే స్థానిక ఎన్నికల్లోనూ పై చేయి ఉంటుందని, కాబట్టి ఇదేం బొత్స రాజకీయ ప్రస్థానానికి పెద్ద దెబ్బ కాదని కొందరు అంటున్నారు. కాకపోతే అధికారి పార్టీ స్థానిక నేతలకు గట్టి పోటీ ఇచ్చేందుకు బొత్స సత్యనారాయణ ప్రయత్నించారని చాలామంది భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో టపాసుల వివాదం..

కత్తులతో దాడి..

ముగ్గురిపై హత్యాయత్నం!
రోడ్డుపై వెళ్తున్న చిన్నారిపై టపాసు విసరడంతో వివాదం..
ప్రశ్నించిన మేనమామతో వాగ్వాదం.. ముగ్గురిపై కత్తులతో దాడి!



హైదరాబాద్, నవంబర్ 09 ।: హైదరాబాద్ నగరంలోని పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో టపాసులు పేల్చే విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. చిన్నారిపై టపాసు విసరడాన్ని ప్రశ్నించినందుకు ముగ్గురు వ్యక్తులపై కత్తులతో దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ గాయపడ్డారు.

చిన్నారిపై టపాసు విసరడంతో మొదలైన గొడవ : అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న ఓ చిన్నారిపై కొందరు వ్యక్తులు టపాసు విసిరినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించిన చిన్నారి మేనమామ వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో వివాదం తీవ్రరూపం దాల్చింది.

సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు కత్తులతో దాడి : చిన్నారిపై టపాసు విసిరిన విషయాన్ని ప్రశ్నించడంతో మొదలైన గొడవలో సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు ముగ్గురిపై కత్తులతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు.

బేగంబజార్ పోలీసుల దర్యాప్తు : ఘటనపై సమాచారం అందుకున్న బేగంబజార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు అసలు కారణాలు ఏమిటి? దాడిలో ఎవరెవరు పాల్గొన్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

చిన్నారుల భద్రతను విస్మరించొద్దు.. వివాదాలతో ప్రాణాలు తీసుకోవద్దు! : పండుగల సమయంలో టపాసులు కాల్చేటప్పుడు చిన్నారుల భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా టపాసులు విసరడం ప్రమాదకరం. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా ప్రశ్నించాలి తప్ప, కత్తులతో దాడులకు దిగడం ఏమాత్రం సమర్థనీయం కాదు. చిన్నపాటి వివాదాలు ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయడం సమాజానికి ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

పీవీ రమేష్ వర్సెస్ సునీల్

హైదనాబాద్.నవంబర్ 9, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మాజీ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య నడుస్తున్న కుటుంబ విబేధాలు ఇప్పుడు సోషల్ మీడియా వేదికపైకి చేరాయి. ఇటీవల ఎన్నికల్లో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు తరపున పీవీ రమేష్ రంగంలోకి దిగి విస్తృత ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ అభ్యర్థికి డిపాజిట్లు కూడా దక్కలేదు. ఈ ఫలితాన్ని ఆసరా చేసుకుని పీవీ రమేష్ మాజీ బావ అయిన పీవీ సునీల్ కుమార్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయి సెటైర్లు విసురుతూ విరుచుకుపడుతున్నారు.ఎన్నికలకు ముందు "ఇప్పటివరకు ఏబీవీకి ఏదో ఒకలా ఓట్లు వస్తాయని ఆశించాం.. కానీ పీవీ రమేష్ ఆయనకు మద్దతు తెలిపి ప్రచారం చేశాక ఇక ఆ ఆశ కూడా వదిలేసుకోవాల్సి వచ్చింది" అంటూ పీవీ సునీల్ ఎద్దేవా చేయడం హాట్ టాపిక్‌గా మారింది. కేవలం ఎన్నికల ఫలితాల తర్వాతే కాకుండా, పోలింగ్‌కు ముందే పీవీ రమేష్ ఎవరికి మద్దతు ఇస్తే వారి డిపాజిట్లు గల్లంతయ్యారంటూ సునీల్ వరుస ట్వీట్లు చేస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ సెటైర్ల వెనుక కేవలం రాజకీయ విబేధాలు మాత్రమే కాకుండా, ఏళ్ల తరబడి రగులుతున్న తీవ్రమైన కుటుంబ కక్షలు ఉన్నాయి.ఈ ఇద్దరు రిటైర్డ్ అధికారుల మధ్య గొడవలకు మూలాలు కుటుంబ వ్యవహారాలే. పీవీ రమేష్ సోదరిని పీవీ సునీల్ కుమార్ వివాహం చేసుకున్నప్పటికీ, మనస్పర్థలు వచ్చి ఇద్దరూ విడిపోయారు. ఆ తర్వాత పీవీ సునీల్ పై ఆయన భార్య గృహహింసా కేసు నమోదు చేయడం, సునీల్ రిటైర్మెంట్ బెనిఫిట్స్, డబ్బులు ఆపేయాలంటూ ప్రభుత్వానికి లేఖలు రాయడం వంటి పరిణామాలు వివాదాన్ని మరింత రాజేశాయి. ఈ కుటుంబ పోరులో భాగంగానే.. పీవీ రమేష్ తన మేనల్లుళ్ల సంపదను, డబ్బును కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ పీవీ సునీల్ బహిరంగంగానే తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు.ఇలా ఇంటి గొడవలను, వ్యక్తిగత కక్షలను సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కించడం ద్వారా ఇటు బ్యూరోక్రాట్ సర్కిళ్లలోనూ, అటు రాజకీయ వర్గాలలోనూ ఈ కుటుంబం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల ఫలితాలను అడ్డుపెట్టుకుని పీవీ రమేష్‌ను దెబ్బతీయాలని పీవీ సునీల్ వేస్తున్న సెటైర్లు, ఇరువర్గాల మధ్య ఉన్న వైరాన్ని తారాస్థాయికి చేర్చాయని చెప్పవచ్చు.

కూటమికి వేకప్ కాల్...

విజయవాడ, నవంబర్ 9, : ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వానికి మేలుకొలుపు లాంటివి. మున్సిపల్, పరిషత్ ఎన్నికల ఫలితాలు అధికార కూటమి వైపు ప్రజలు ఏకపక్షంగా మొగ్గు చూపినట్లు స్పష్టం చేస్తున్నా ఓటు బ్యాంకు ఎంత మాత్రం పెరగలేదన్నది స్పష్టం. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి ప్రభంజనాన్ని గుర్తుచేస్తూ కూటమి క్లీన్ స్వీప్ దిశగా దూసుకుపోతుందని ఆ పార్టీ నేతలు భావించవచ్చు. అయితే వైసీపీ ఓటు బ్యాంకు కూడా ఏ మాత్రం తగ్గలేదు. కూటమి ఓటు బ్యాంకు కూడా పెరగకలేదన్నది కొంత అర్థమవుతుంది. కొన్ని ప్రాంతాల్లో గత శాసనసభ ఎన్నికలకంటే వైసీపీకి అత్యధిక ఓట్ల శాతం వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం తాము అమలు చేసే సంక్షేమం, అభివృద్ధి ఒక్కటే సరిపోదన్నది గుర్తించాలి. ఎమ్మెల్యేల అవినీతి, ఇతర అంశాలు ప్రజలపై రానున్న కాలంలో మరింత ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. అందుకే ఈ ఎన్నికలు మేలుకొలుపు వంటివనే చెప్పాలి. మొత్తం 13 మున్సిపల్ కార్పొరేషన్లలో 12 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. అలాగే 87 మున్సిపాలిటీలు, నగర్ పంచాయతీలలో 79 కంటే ఎక్కువ చోట్ల కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. పరిషత్ పోరులోనూ అదే జోరు కొనసాగించింది. నేడు వెలువడుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ కౌంటింగ్‌లోనూ కూటమి అభ్యర్థులు వందలాది స్థానాల్లో స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతున్నారు. ప్రతిపక్ష వైసీపీ కేవలం కొన్ని పరిమిత స్థానాలకే పరిమితమైంది.భారీ విజయాలు దక్కినప్పటికీ, అంతర్గత విశ్లేషణల ప్రకారం కూటమి ప్రభుత్వానికి ఈ క్రింది అంశాలు హెచ్చరికలుగా మారాయి. రాష్ట్రవ్యాప్తం గా కూటమి సునామీ సృష్టించినా, రాయలసీమలోని కీలకమైన అనంతపురం కార్పొరేషన్‌ను వైసీపీ మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం కూటమికి పెద్ద షాక్. స్థానిక నేతల మధ్య సమన్వయ లోపం, అసంతృప్తులే ఇందుకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పలు స్థానాల్లో కూటమి అధికారిక అభ్యర్థులపై కూటమికి చెందిన రెబెల్ అభ్యర్థులు రంగంలోకి దిగి గెలిచారు లేదా కూటమి ఓటమికి కారణమయ్యారు.. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా స్పందిస్తూ.. చిన్నపాటి సమన్వయ లోపాల వల్ల కొన్ని సీట్లు కోల్పోయామని, కూటమి ధర్మాన్ని కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లోనూ జనసేన పార్టీ పోటీ చేసిన మెజారిటీ స్థానాల్లో అద్భుతమైన విజయాన్ని దాదాపు 100 శాతం స్ట్రయిక్ రేట్ నమోదు చేసింది. ఇది కూటమిలో జనసేన బలాన్ని మరింత పెంచింది. రాబోయే రోజుల్లో సీట్ల సర్దుబాటు, స్థానిక సంస్థల పదవుల పంపకాల్లో ఎలాంటి అసంతృప్తులు రాకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.నవంబర్ నెలాఖరులో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

పట్టణ ఓటర్లు కూటమికి జై కొట్టినా, గ్రామీణ స్థాయిలో గ్రూపు రాజకీయాలు ఎక్కువగా ఉంటాయి. అక్కడ తప్పులు జరగకుండా ఉండాలంటే క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం కావాలి.ఈ ఫలితాలు ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని, అభివృద్ధి-సంక్షేమ పాలనకు ఇచ్చిన నీరాజనాన్ని స్పష్టం చేస్తున్నా ఎక్కడో తేడా కొడుతున్నట్లు కనిపిస్తుంది. అయితే, ప్రతిపక్షం పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదని, అసంతపురం వంటి చోట్ల పుంజుకునే సత్తా చాటిందని ఫలితాలు చెబుతున్నాయి. అందువల్ల, అతివిశ్వాసానికి పోకుండా స్థానిక విభేదాలను పక్కనబెట్టి, ప్రజల సమస్యలపై మరింత దృష్టి పెట్టడమే కూటమి ముందున్న తక్షణ కర్తవ్యం.

కారేపల్లి నూతన ఎస్సైగా వి. రమేష్ బాధ్యతల స్వీకరణ!



కారేపల్లి,:ఖమ్మం జిల్లా కారేపల్లి మండల నూతన ఎస్సైగా వి. రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కారేపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన బైరు గోపి ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న వి. రమేష్ బదిలీపై కారేపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై వి. రమేష్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు, అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీలో వరుస ఎన్నికలు..



విజయవాడ, నవంబర్ 9, : ఏపీలో వరసగా ఎన్నికలు జరుగుతున్నాయి. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇప్పటికే ముగిశాయి. దీంతో ప్రభుత్వం మిగతా పంచాయతీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికలపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అధికారులు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను కూడా ఇవ్వడం జరిగింది.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందడి నెలకొంది. ముందు మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా.. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. వీటికి సంబంధించిన ఫలితాలు కూడా వచ్చేశాయ్. దీంతో మిగిలిన ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ఎ ఖరారు అయింది. ఇక ప్రాథమి వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈ ఎలక్షన్‌ని ఒకే విడతలో నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు శనివారం జిల్లా సహకార అధికారులకు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను జారీ చేశారు.అలాగే ఈ ఎలక్షన్ పనుల్లో ఎలాంటి ఆలస్యం, నిర్లక్ష్యం సహించేది లేదని కమిషనర్ తెలిపారు. కిందిస్థాయి అధికారులకు, ఎంప్లాయిస్‌కి ఎన్నికల నిర్వహిణతో పాటు చట్టపరంగా ఉన్న నిబంధనలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అంతే కాదు ఆదేశాలు అందిన పది రోజుల్లోగా వెంటనే సంబంధిత కార్యాచరణపై రిపోర్ట్ అందించాలని తెలియజేశారు. దీంతోపాటు రైతు సేవా కేంద్రాల వారీగా ప్రాథమిక ఓటర్ల లిస్ట్‌లను రెడీ చేసి, 'ఈ-పీఏసీఎస్ ఈఆర్‌పీ' పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా ఓటర్లకు అనుకూలంగా ఉండే పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ముందుగానే అంచనాకు రావాలని సూచించడం జరిగింది.ఈ కోపరేటివ్ సోసైటీ ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. కాబట్టి దీనికి తగ్గట్టుగా బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి, ప్రింటింగ్ ప్రెస్‌ల లభ్యతపై ముందస్తు ప్లాన్ చేసుకోవాలని కమిషన్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించి, చట్టపరమైన విషయాలపై పట్టున్న అధికారులను నియమించాలని చెప్పారు. దీంతోపాటు పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు ట్రైనింగ్ ఇవ్వాలని, ఇతర శాఖల ఉద్యోగుల వివరాలను సేకరించాలని కూడా సూచించారు. ఎన్నికల నిర్వహణకయ్యే ఖర్చులను అంచనా వేయాలని అలాగే శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించాలని సంబంధిత మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. ఆ ఎన్నికలు వచ్చే నెల మొదటి వారంలోనే పూర్తి కానున్నాయి. గ్రామాల్లో సందడి: రాష్ట్రంలో 13 వేల 219 పంచాయతీలకు పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. ఈ నెల 13వ తేదీన ఎన్నికల షెడ్యూల్2ని అధికారికంగా రిలీజ్ చేయనున్నట్లు ూఇఅ ప్రకటించింది. దీంతో మళ్లీ పొలిటికల్ హీట్ ఎక్కింది.పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో జరగనున్నాయి. ఈ మేరకు నవంబర్ 13న మొదటి దశ, 16న రెండో దశ, 19వ తేదీన మూడో దశకు నోటిఫికేషన్లను జారీ చేయనున్నారు. తొలివిడతలో భాగంగా నోటిఫికేషన్ 13న విడుదలైతే.. నవంబర్ 17వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి.. ఫలితాలను వెల్లడించడం జరుగుతుంది. రెండో విడతలో భాగంగా 16న నోటిఫికేషన్ రిలీజ్ చేస్తారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 20. ఇక నవంబర్ 29న పోలింగ్, ఫలితాలు వెల్లడిస్తారు. అలాగే మూడో విడత నోటిఫికేషన్ 19న విడుదల కాగా.. నవంబర్ 23 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. ఫైనల్ పోలింగ్, ఫలితాలను డిసెంబర్ 2వ తేదీన వెల్లడించడం జరుగుతుంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు చాలా కీలకంగానే ఉంటాయి. గ్రామాల్లో ఈ ఎన్నికల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తికరంగా ఉంటారు. ఈ పంచాయతీ ఎన్నికలు అధికారికంగా పార్టీల గుర్తులపై జరగకపోయినా.. కూటమి, వైసీపీ మద్దతుదారుల మధ్యే పోటీ తీవ్రంగా ఉంటుంది. రాష్ట్రంలో కొత్త గవర్నమెంట్ ఏర్పాటైన తర్వాత జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో అధికార, ప్రతిపక్షాలకు ఇవి అత్యంత కీలకం కానున్నాయి. మొత్తానికి పల్లె పోరుకు సిద్ధమైంది.

అధికారుల నిర్లక్ష్యం..

వృథాగా పోతున్న భగీరథ నీళ్లు



మాగనూరు : ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాల కోసం ఆదా చేయాలని ప్రభుత్వం ఒకవైపు ప్రచారం చేస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచేలా మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మాగనూరు మండల కేంద్రంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలి మూడు రోజులైనా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పారుతూ చెరువును తలపిస్తోంది. పైప్‌లైన్ నుంచి బయటకు వస్తున్న నీరు పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున నిలిచిపోవడంతో నీటి వనరులు వృథా కావడమే కాకుండా పరిసర ప్రాంతాలు చిత్తడిగా మారుతున్నాయి. ఒకవైపు మాగనూరు కృష్ణ మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల ప్రజలు మిషన్ భగీరథ ద్వారా సక్రమంగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా నీరు వృథాగా పారుతున్నా అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాల నే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా పథకం లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాగనూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు జాతీయ రహదారి పక్కన ప్రజలకు తాగునీరు అందించాల్సిన పైప్‌లైన్ల నుంచే నీరు వృథాగా ప్రవహిస్తుంది. నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పే ప్రభుత్వ యంత్రాంగం ముందుగా తన శాఖల పరిధిలో జరుగుతున్న నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ అనంతరం చాలా మంది చేయాల్సిన పనులు ఇవే..



ఉద్యోగ విరమణ అంటే పని జీవితానికి ముగింపు. కానీ చురుకైన జీవనానికి మాత్రం ముగింపు కాకూడదు. వయసు పెరిగే కొద్దీ శారీరకంగా ఆరోగ్యంగా ఉండడంతోపాటు మానసికంగా చురుకుగా, సామాజికంగా అందరితో కలిసిమెలిసి ఉండటం కూడా ఎంతో ముఖ్యం. కార్యాలయం నుంచి బయటకు వచ్చినంత మాత్రాన ఉత్పాదకతకు దూరం కావాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ఆర్థికంగా పదవీ విరమణకు సిద్ధమవ్వడంతోపాటు, ఆ తర్వాతి జీవితాన్ని ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడిపేందుకు కూడా ముందుగానే ప్రణాళిక వేసుకోవాలని సూచిస్తున్నారు. ఆధునిక వైద్యం, టీకాలు, యాంటీబయాటిక్స్ వల్ల మనుషుల ఆయుర్దాయం పెరిగింది. అయితే ఎక్కువకాలం జీవించడం మాత్రమే ముఖ్యం కాదు. ఆ కాలమంతా ఆరోగ్యంగా ఉండడం కూడా అవసరం. మనం ఎంతకాలం బతుకుతున్నామన్నదానితోపాటు, ఎంతకాలం ఆరోగ్యంగా జీవిస్తున్నామన్నది ముఖ్యమని వారు అభిప్రాయపడుతున్నారు.

ఒక్కసారిగా మారిపోయే దినచర్య..: ఉద్యోగ విరమణ తర్వాత చాలామందికి రోజువారీ దినచర్య ఒక్కసారిగా మారిపోతుంది. కార్యాలయ వాతావరణం, సహోద్యోగులతో మాట్లాడడం, రోజువారీ పనులు తగ్గిపోతాయి. కొందరు ఎక్కువ సమయం ఇంట్లోనే టీవీ చూస్తూ లేదా ఫోన్ ఉపయోగిస్తూ గడుపుతారు. దీనివల్ల చురుకుదనం, జీవితంపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంటుంది. పదవీ విరమణ అంటే శరీరం విశ్రాంతి తీసుకోవడం కాదని, జీవితంలో ఏదో ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని సూచిస్తున్నారు. 60 ఏళ్ల తర్వాత కూడా వ్యాపారం ప్రారంభించడం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, సమాజ సేవ చేయడం లేదా చాలాకాలంగా చేయాలనుకున్న అభిరుచులను కొనసాగించడం ద్వారా ఉత్సాహంగా ఉండవచ్చు. ఆలయాల్లో సేవ చేయడం, వృద్ధుల కోసం స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేయడం వంటి పనులు కూడా జీవితానికి కొత్త ప్రయోజనాన్ని ఇస్తాయి. వృద్ధుల్లో ఒంటరితనం మరో ప్రధాన సమస్య. కుటుంబ సభ్యులతో సంబంధాలు తగ్గడం, స్నేహితుల సంఖ్య తగ్గిపోవడం, కదలికల పరిమితులు వంటి కారణాలతో చాలామంది ఒంటరిగా భావిస్తారు. పట్టణ భారతదేశంలో ప్రతి నలుగురిలో ఒకరు గణనీయమైన ఒంటరితనాన్ని అనుభవిస్తున్నట్లు ఒక అధ్యయనం సూచిస్తోందని పేర్కొంటున్నారు. స్నేహితులతో మాట్లాడడం, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, నడక బృందాలు, ఆటలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడంద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.

ఆరోగ్యంగా ఉండవచ్చు..

మెదడును చురుగ్గా ఉంచుకోవాలి..: వయసు పెరిగినా మెదడును చురుకుగా ఉంచుకోవడం అవసరం. చదవడం, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, ఫొటోగ్రఫీ, చదరంగం వంటి అభిరుచులను కొనసాగించడం మానసిక చురుకుదనానికి తోడ్పడతాయి. వృద్ధాప్యం సహజమే అయినప్పటికీ, శారీరక క్షీణత తప్పనిసరి కాదని చెబుతున్నారు. కండరాలను బలోపేతం చేసుకోవడం, రోజూ కదలడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని నియంత్రించడం ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి ముఖ్యమైన అంశాలు. వయసుతోపాటు కండరాల బలం తగ్గుతుంది కాబట్టి బరువులతో చేసే వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నడక మంచిదే అయినప్పటికీ, అదే పూర్తిస్థాయి వ్యాయామం కాదని సూచిస్తున్నారు. కండరాలను కాపాడుకోవడానికి శక్తి వ్యాయామంతోపాటు తగినంత ప్రొటీన్ తీసుకోవడం కూడా అవసరం. ఉద్యోగ విరమణను జీవితానికి ముగింపుగా కాకుండా కొత్త అవకాశాలకు ప్రారంభంగా చూడాలి. కొత్త ఆసక్తులను పెంపొందించుకోవడం, సమాజంతో సంబంధాలు కొనసాగించడం, శారీరకంగా చురుకుగా ఉండడం ద్వారా వృద్ధాప్యాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపవచ్చు. ఆర్థిక భద్రతతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా ముందుగానే ప్రణాళిక వేసుకోవడమే దీర్ఘకాలిక ఆరోగ్యానికి కీలకమని తెలియజేస్తున్నారు.

ఆదివాసి గుడేల్లో మార్మోగుతున్న దండారి వేడుకలు



నార్నూర్, నవంబర్ 9, అదిలాబాద్ జిల్లా నార్నూర్ గాదిగూడ మండలాల పరిధిలోని ఆదివాసి గూడేల్లో దండారి వేడుకలు మార్మోగుతున్నాయి. డప్పుల చప్పుడు.. కోలాటం, గుస్సాడి నృత్యాలతో ఆధ్యాత్మికత ఆకట్టుకుంటుంది. చిన్న పెద్ద తేడా లేకుండా దండారి వేడుకలలో పాల్గొంటున్నారు.

కొల బోడి తో దండారి వేడుకలు ముగిస్తాయని దండారి నిర్వాహకులు పేర్కొంటున్నారు. గాదిగూడ మండలంలోని రోమన్ కసాలో దండాలు ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యూన్సీ అక్బానీ, గాదిగూడ మండలం మాజీ వైస్ ఎంపీపీ మర్సివనే యోగేష్ దండారి కార్యక్రమాలలో పాల్గొని గుస్సాడీలను, నిర్వాహకులను, గ్రామ పటేళ్లను శాలువతో సన్మానించారు, కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోడం నర్మద జంగు, బి.ఆర్. ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పూసం బాదిరావ్, మాజీ సర్పంచ్ ఇంద్రభాన్, గ్రామ పెద్దలు ఉన్నారు.

'నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి'

- ఓబీ పనులు వేగవంతం చేసి బొగ్గు ఉత్పత్తిని పెంచాలి

- నాణ్యత, రవాణాతో పాటు కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- సింగరేణి ఈడీ (కోల్ మూవ్‌మెంట్), ఐ ఆర్.టి.ఎస్ బాధావత్ వెంకన్న



రుద్రంపూర్, నవంబర్ 09 : కొత్తగూడెం ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్), ఆఫీసర్ బాధావత్ వెంకన్న అన్నారు. సోమవారం ఆయన ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ, సంబంధిత అధికారులతో కలిసి వీకే కోల్ మైన్స్, ఆర్‌సీహెచ్‌పీలను సందర్శించారు. వీకే ఓపెన్‌కాస్ట్ గని వ్యూ పాయింట్ నుంచి ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు పనులను పరిశీలించిన ఆయన, మట్టి తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని అధికారులను ఆదేశించారు. రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. "నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి. ఓబీ తొలగింపు పనుల్లో వేగం పెంచి బొగ్గు ఉత్పత్తికి అవసరమైన ఏర్పాట్లు చేయాలి. ఉత్పత్తితో పాటు బొగ్గు నాణ్యతపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వినియోగదారులకు నిర్దేశిత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలి. ఉత్పత్తి, రవాణాలో రోజువారీ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలి. రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. ముఖ్యంగా ఉపరితల గనుల్లో ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఉత్పత్తి చేపట్టాలి" అని సూచించారు. అనంతరం ఆర్‌సీహెచ్‌పీని సందర్శించి రైలుమార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణాను పరిశీలించారు. బొగ్గు గ్రేడ్లను తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వినియోగదారులకు బొగ్గు సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఏరియా జీఎం సీహెచ్ వెంకటరమణ, ఎస్ఓ టు జీఎం గోవిందరావు, ఏరియా ఇంజనీర్ విత్తనాల రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వీకే సీఎంఎం మేనేజర్ మురళి, సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్, ఇతర విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

సాకివాగులో ఘనంగా జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు

- గిరిజన సంస్కృతితో అలరించిన కళాకారులు



ములకలపల్లి, నవంబర్ 09 : ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని రాచన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సాకివాగు గ్రామంలో 15 రోజులపాటు నిర్వహిస్తున్న జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) భద్రాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన హక్కులు, ఆత్మగౌరవం కోసం బిర్సా ముండా తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని అన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే 15 రోజులపాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సర్పంచులు కళాకారులతో కలిసి చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారుల ప్రదర్శనలు, సంప్రదాయ వాయిద్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వగ్గెల వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి బిట్ట వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పద్దం లక్ష్మణరావు, మడివి సోనయ్య, మడకం రవి, కోవాడి రాజు, మహిళలు, యువకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



బూర్గంపహాడ్, నవంబర్ 09 : మండల కేంద్రమైన బూర్గంపహాడ్ రైతు వేదికలో టేకులచెరువు పంచాయతీకి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందని, సొంత ఇల్లులేని నిరుపేద కుటుంబాలను గుర్తించి ఇళ్ల పత్రాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికసాయం అందిస్తుందని, నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, భజన ప్రసాద్, సర్పంచ్, ఉప సర్పంచులుమందా నాగరాజు, గుండె వెంకన్న, వారాల వేణు, ఆయా పంచాయతీల సర్పంచ్, ఉప సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ విజేత నల్లగొండ జట్టు

- అభినందించిన డీఈవో సుశీందర్ రావు, ఎఎంవో శ్రీనివాస్ గౌడ్



రామగిరి, నవంబర్ 09 : హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో నిర్వహించిన పీఎం శ్రీ స్కూల్స్ తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. 17 ఏళ్లలోపు బాలికల కబడ్డీ విభాగంలో ప్రథమ బహుమతి సాధించడంతో పాటు, మార్చ్‌ఫాస్ట్ విభాగంలోనూ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా విజేత క్రీడాకారిణులతో పాటు కోచ్, మేనేజర్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి ఎ.శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. జిల్లా స్థాయిలో క్రీడాకారిణులు సాధించిన ఈ విజయం నల్లగొండ జిల్లాకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శిని అభినందించారు.

హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి

ఆత్మహత్య

ప్రిన్సిపల్, లెక్చరర్ అరెస్ట్!

- ఎస్ఆర్ నగర్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి భానుప్రసాద్ రెడ్డి ఆత్మహత్య

- ఆత్మహత్యకు పురిగొల్పారన్న ఆరోపణలతో ప్రిన్సిపల్, లెక్చరర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

- ఫోన్ ఇవ్వకుండా వేధించారని విద్యార్థి బలవన్మరణం



హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ పరిధిలో చోటుచేసుకున్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి ఆత్మహత్య కేసులో పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు పురిగొల్పారన్న ఆరోపణలపై బల్కంపేటలోని అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్ భాస్కర్‌లను ఎస్ఆర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన కట్టా భాను ప్రసాద్ రెడ్డి (20) నగరంలో హోటల్ మేనేజ్‌మెంట్ సెకండియర్ చదువుతూనే, ఖర్చుల కోసం పార్ట్‌టైమ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఓ మహిళా లెక్చరర్ ఫొటోను ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ చేసి తోటి విద్యార్థికి పంపడంతో వివాదం మొదలైంది. ఈ విషయం తెలుసుకున్న లెక్చరర్ విద్యార్థి మొబైల్ ఫోన్‌ను లాక్కుని ప్రిన్సిపల్‌కు అప్పగించారు. తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతూ భానుప్రసాద్ క్షమాపణ కోరాడు. అతని సోదరుడు ప్రవీణ్ రెడ్డి కూడా కళాశాలకు వచ్చి క్షమించాలని ప్రాధేయపడ్డారు. అయినప్పటికీ ఫోన్ తిరిగి ఇవ్వకుండా వారం రోజులుగా వేధించారని తోటి విద్యార్థులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. డెలివరీ పనికి ఫోన్ అత్యవసరం కావడం, కాలేజీలో అవమానం జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భానుప్రసాద్ శుక్రవారం రాత్రి తన గదిలో ఉరివేసుకుని తనువు చాలించాడు. తప్పును అంగీకరించి క్షమాపణ చెప్పినా ఫోన్ ఇవ్వకుండా వేధించడమే ఈ దారుణానికి కారణమని తోటి విద్యార్థులు ఆరోపించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రిన్సిపల్, మరో లెక్చరర్ భాస్కర్ ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సైబర్ భద్రతపై రాజీపడొద్దు

ఏఐ దాడుల వేళ.. మరింత అప్రమత్తం!

బ్యాంకులు, క్విక్ కామర్స్ సంస్థలకు నగర సీపీ సజ్జనర్ హెచ్చరిక

థర్డ్ పార్టీ మాడ్యూళ్లకూ పకడ్బందీ రక్షణ తప్పనిసరి



హైదరాబాద్: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అంతర్జాతీయ సైబర్ ముఠాలు విరుచుకుపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. పౌరుల ఆర్థిక లావాదేవీలు, సున్నితమైన సమాచారాన్ని (డేటా) నిక్షిప్తం చేసే సంస్థలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, క్విక్ కామర్స్ వేదికలు, మొబిలిటీ ప్లాట్‌ఫారమ్‌లు తమ సైబర్ రక్షణ వ్యవస్థలతో పాటు నిపుణులైన మానవ వనరులను వెంటనే బలోపేతం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత దాడులతో పాటు విదేశీ హ్యాకర్లు విసురుతున్న సరికొత్త సవాళ్లను తిప్పికొట్టేలా ముందస్తు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చాలా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్స్ కంపెనీ(ఎన్ఎఫ్‌బీసీ)లు వినియోగదారుల వ్యక్తిగత సమాచారం, చెల్లింపుల నిర్వహణ కోసం థర్డ్ పార్టీ మాడ్యూళ్లు, ఏపీఐ సేవలపై ఆధారపడుతున్నాయని, ఇలాంటి సహాయక వ్యవస్థలను కూడా ప్రధాన అప్లికేషన్లతో సమానంగా పరిగణించి అత్యున్నత భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఏఐ ఏజెంట్ల సాయంతో ఆర్థిక సంస్థల నెట్‌వర్క్‌లలోని లోపాలను సులువుగా గుర్తిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా అప్‌డేట్ చేయని పాత సాఫ్ట్‌వేర్లు, తప్పుడు కాన్ఫిగరేషన్ ఉన్న ఇంటర్నెట్ వ్యవస్థలు, కస్టమర్ల ఫిర్యాదుల పోర్టళ్లలోని సాంకేతిక లొసుగులను ఆసరాగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆటోమేటెడ్ ఫండ్ డిస్బర్స్‌మెంట్ వ్యవస్థలు, పేమెంట్ ఏపీఐల ద్వారా కంటిరెప్ప మూసి తెరిచేలోగా మ్యూల్ ఖాతాల్లోకి కోట్ల రూపాయల నిధులను మళ్లించి, పోలీసులకు ఆనవాళ్లు దొరక్కుండా డిజిటల్ రికార్డులను సైతం పూర్తిగా తుడిచిపెట్టేసేందుకు యత్నిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సరికొత్త సైబర్ ముప్పును అడ్డుకునేందుకు ఆర్థిక సంస్థలు తక్షణమే పలు కీలక రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వినియోగంలో లేనివి, గతంలో టెస్టింగ్ కోసం రూపొందించి వదిలేసిన పాత ఏపీఐలను సిస్టమ్‌ల నుంచి వెంటనే తొలగించాలన్నారు. ముఖ్యంగా నగదు విడుదల చేసే కీలక వ్యవస్థలకు పటిష్ఠమైన భద్రత కల్పించడంతో పాటు సంస్థల్లో వాడే సాఫ్ట్‌వేర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ఇంటర్నెట్‌తో అనుసంధానమైన కస్టమర్ పోర్టళ్ల భద్రతను ప్రతిరోజూ నిశితంగా సమీక్షించాలని స్పష్టం చేశారు. ఒకేసారి అసాధారణ వేగంతో, భారీ మొత్తాల్లో జరిగే లావాదేవీలను వెంటనే గుర్తించేలా ప్రత్యేక పరిమితులు విధించాలని, లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నగదు ఖాతాల్లోకి వెళ్లేముందు పూర్తిస్థాయి కేవైసీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడటంతో పాటు ఉన్నతాధికారుల ఆమోదాన్ని తప్పనిసరి చేయాలన్నారు. అలాగే ఆకస్మిక దాడులు జరిగితే ఎలా స్పందించాలో తెలుసుకునేందుకు ఐటీ, సైబర్ భద్రతా బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ తరచూ 'రెడ్ టీమ్' మాక్ డ్రిల్స్ నిర్వహించి సిబ్బందిని సంసిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. డిజిటల్ వ్యవస్థల్లో ఎక్కడా చిన్నపాటి భద్రతా లోపం కూడా తలెత్తకుండా సంస్థలు అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, పౌరుల ఆర్థిక భద్రత దృష్ట్యా ఈ ముందస్తు నివారణ చర్యలు అత్యంత కీలకమని పునరుద్ఘాటించారు. ఎవరైనా అనుమానాస్పద లావాదేవీలను గుర్తించినా లేదా సైబర్ మోసానికి గురైనా తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబరు 1930ను సంప్రదించాలని లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి : హాలియా ఏడీఏ సరిత



గుర్రంపోడ్, నవంబర్ 09 : ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని హాలియా ఏడీఏ సరిత అన్నారు. సోమవారం గుర్రంపోడ్ మండలంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు.

రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, నీటి లభ్యతపై ఏర్పడే ప్రభావాల గురించి రైతులకు వివరిం చారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. తక్కువ నీటి అవసరం కలిగిన ఆరుతడి పంటలైన కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, కొర్ర వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల ఎంపికలో స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం మరియు నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. అలాగే వరి పంట కోత అనంతరం పంట అవశేషాలను (వరి గడ్డిని) పొలాల్లో తగులబెట్టవద్దని రైతులకు సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. వరి గడ్డిని తగులబెట్టకుండా పొలంలోనే కలియదున్నడం లేదా ఇతర సేంద్రీయ పద్ధతుల్లో వినియోగించుకోవాలని సూచించారు. నీటి పొదుపు పద్ధతులు పాటిస్తూ, అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకొని ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించే విధంగా రైతులు వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఏడీఏ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రామాంజనేయులు, గౌతమి, భాగీరథ, హఫీదా, జ్యోత్స్న, ధరణి, నేతాజీ, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


హౌసింగ్ ఏఈ ఉదయ్‌కిరణ్‌కు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సన్మానం



బూర్గంపహాడ్, నవంబర్ 09 : జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిలో బూర్గంపహాడ్ హౌసింగ్ ఏఈ ఉదయ్‌కిరణ్ ప్రథమస్థానం సాధించారు. సోమవారం హౌసింగ్ ఏఈ ఉదయకిరణ్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా అభినందించారు. మండలంలో 675 ఇళ్లు మంజూరు కాగా వాటి నిర్మాణ పనులు ప్రారంభించి 450 ఇళ్లను పూర్తి చేసినందుకు ఈ సత్కారం దక్కింది. జిల్లాలో ప్రథమస్థానం సాధించడం మండలానికే గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో మిగిలిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వారాల వేణు, సర్పంచ్ మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, ఎడమకంటి సుధాకర్‌రెడ్డి, భజన ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపు దాడులు

నాలుగు టిప్పర్లు సీజ్



మాగనూరు : మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నవాహనాలపై తెల్లవారుజామున పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి నాలుగు టిప్పర్లను పట్టుకున్నారు. ఎస్సై కే మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు వడ్యాట్ గ్రామ శివారులో రెండు టిప్పర్లు, వడ్యాట్ నుంచి చందాపూర్ వెళ్లే మార్గంలో మరో రెండు టిప్పర్లను పోలీసులు గుర్తించారు. వాహనాల్లో ఇసుక తరలిస్తున్న ప్పటికీ అందుకు సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో నాలుగు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మండలంలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మండలంలో అక్రమ ఇసుక దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడేలా నిరంతర నిఘా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల కొరతతో చదువులకు ఆటంకం



ఊట్కూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తో విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలని బీఆర్ఎస్వీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోరం శివరాజ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఊట్కూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఉన్న ఉపాధ్యాయులపై అదనపు పనిభారం పడటంతో విద్యాబోధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే విద్యా వాలంటీర్లను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు విష్ణువర్ధన్, అభిలాష్, అభిత్ ఖాన్, ఇంజు, ఇమ్రాన్, మనోహర్, మాజీ ఉపసర్పంచ్ ఇబదూర్ రహిమాన్, తరుణ్, మాజీ వార్డు సభ్యుడు షేక్ సమీ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లను నియమించాలి

డంపింగ్ యార్డ్ సమస్యను రాజకీయాలకు వాడుకోవద్దు..

బిఆర్ఎస్ మాజీ మేయర్ రవీందర్ సింగ్



కరీంనగర్:డంపింగ్ యార్డ్ సమస్యను రాజకీయాలకు వాడుకోవద్దని, పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులందరూ కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్ఎస్ నేత కోరారు.డంపింగ్ యార్డ్ తొలగింపునకు రూ. 16. 50 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. టెండర్ ప్రక్రియపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న వారి పేర్లు బయటపెట్టి కేసులు నమోదు చేయించాలని, లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు.రాజకీయ విమర్శలు పక్కనపెట్టి ప్రజల ఆరోగ్యం, నగర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, డంపింగ్ యార్డ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

నెలలుగా సాగునీరు వృథా.. పట్టించుకోని ఇరిగేషన్ శాఖ





మాగనూరు, నవంబర్ 09 : సంగం బండా రిజర్వాయర్ నీటి ప్రతి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాల కోసం ఆదా చేయాలని ప్రభుత్వాలు ఒకవైపు చెబుతుంటే.. మరోవైపు సంఘం బండా రిజర్వాయర్ రైట్ లో లెవెల్ కెనాల్ కాలువకు పడిన గండిని పూడ్చడంలో ఇరిగేషన్ శాఖ అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం రైతులకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. కొన్ని నెలలుగా కాలువకు గండి పడటంతో విలువైన సాగునీరు వృథాగా పారిపోతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నీరు వృథా అవుతున్నా పట్టని అధికారులు!: రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న సాగునీరు కాలువ గండి ద్వారా పక్కదారి పడుతూ వృథాగా ప్రవహిస్తోంది. కాలువ గండి కారణంగా నీరు అవసరం లేని ప్రాంతాల్లోకి కూడా చేరుతుండగా, సాగుకు అవసరమైన సమయంలో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తే సమస్య తీవ్రత స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు మాత్రం మరమ్మతులు చేపట్టడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వార్తలు వచ్చినా స్పందన శూన్యం..!: కాలువ గండి సమస్యపై ఇప్పటికే పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారుల్లో ఎలాంటి స్పందన కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలు వెలుగులోకి వచ్చినప్పుడు స్పందించి పరిష్కరించాల్సిన అధికారులు వార్తలను సైతం పట్టించుకోకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోందని విమర్శిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు కాలయాపన చేస్తూ రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నారని మండిపడుతున్నారు.

జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ ఏది..?: క్షేత్రస్థాయిలో పరిస్థితిని స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన జిల్లా స్థాయి ఇరిగేషన్ అధికారులు స్థానిక అధికారుల సమాచారానికే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నీరు ఏ విధంగా వృథా అవుతోంది..? కాలువ గండి ఎంత మేరకు ఉంది,,..? మరమ్మతులకు ఎంత ఖర్చవుతుంది.. ? అనే అంశాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడం అధికారుల పర్యవేక్షణపై అనేక అనుమానాలకు తావిస్తోంది.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారా?: నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, సాగునీరు, తాగునీటిని వృథా చేయకుండా చూడాలని ప్రభుత్వం పదేపదే సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు, ఇరిగేషన్ శాఖ అధికారుల పనితీరుకు పొంతన లేకుండా పోతోందని రైతులు విమర్శిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన సాగునీటి వ్యవస్థను కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా స్పందించాలి.. రైతుల డిమాండ్!: ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సంఘం బండా రిజర్వాయర్ కాలువ గండి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించాలని, వెంటనే మరమ్మతులు చేపట్టి వృథాగా పారుతున్న సాగునీటిని అరికట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యపై నిర్లక్ష్యం వహించిన అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించి బాధ్యత నిర్ణయించాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు నీటిని ఆదా చేయాలని పిలుపునిస్తుంటే.. అధికారులు మాత్రం కళ్లముందే నీరు వృథా అవుతున్నా మౌనంగా ఉండటం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం నీటి సంరక్షణ గురించి చెప్పడమేనా..? క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత అధికారులకు లేదా..? సంగం బండా రిజర్వాయర్ కాలువ గండికి మరమ్మతులు ఎప్పుడు చేపడతారో వేచి చూడాల్సిందే..!